ప్రజాశక్తి
సోమవారం 28 అక్టోబర్ 2024
5
శ్రీ సత్యసాయి





జెండా ఆవిష్కరణలో నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - నల్లమాడ

కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానానికి విరుద్ధంగా విద్యుత్ ఛార్జీలను 44 శాతం పెంచడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇఎస్ వెంకటేష్ విమర్శించారు. మండల కేంద్రము లోని సాయి కళ్యాణ మండపంలో ఆదివారం సీపీఎం మండల కార్యదర్శి గోవిందు ఆధ్వర్యంలో మండలం శాఖ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఎస్ వెంకటేష్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్రంలోని కూటమి ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ రాష్ట్ర, దేశ ప్రజలకు ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగంపై దాడి చేస్తున్న బీజేపి మతోన్మాద శక్తులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నారని అధికారంలోకి వచ్చిన తరువాత భారీగా పెంచడం దుర్మార్గమని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం 8 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ఎన్నికల్లో ఓడిపోయిందని,కూటమి ప్రభుత్వం దీని నుండి గుణపాఠం తీసుకుని వెంటనే పెంచిన ఛార్జీలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలను ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి పార్టీలు ఎన్నికల వాగ్దానాలకు విరుద్ధంగా విద్యుత్ ఛార్జీలను 44 శాతం పెంచడాన్ని సిఐటియు ఖండిస్తుందన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి ఎన్నికల్లో ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత భారీగా పెంచడం తగదన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి సర్కార్ విద్యుత్ ఛార్జీలు పెంచి అందుకు కారణలను ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారని మండిపడ్డారు. ఈ రెండు ప్రభుత్వాలు ప్రయివేట్ ఉత్పత్తిదారుల నుంచి అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేసి భారాన్ని ప్రజలపై మోపుతున్నాయని ధ్వజమెత్తారు. ప్రత్యేకించి అసంఘటిత కార్మికులు, నిరుద్యోగులపై ఈ భారం అత్యధికంగా ఉంటుందన్నారు. గత వైసీ ప్రభుత్వం 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ఎన్నికల్లో మూల్యం చెల్లించుకుందని, కూటమి ప్రభుత్వం దాని నుంచి గుణపాఠం నేర్చుకుని పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షనమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, నాయకులు ఆటో నాగప్ప, రిజ్వాన్, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడల్లో కన్పించని అభివృద్ధి

మౌలిక వసతులు లేక ఇబ్బందులు

నూతన పరిశ్రమల ఏర్పాటుపై సర్కారు నిర్లక్ష్యం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడ హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురంలో ఉన్నాయి. 1985వ సంవత్సరం అక్టోబర్ 16వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పారిశ్రామిక వాడను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఇక్కడ వందలాది పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. అయితే పారిశ్రామిక వాడలో మాత్రం అభివృద్ధి జాడ కనిపించడం లేదు. పారిశ్రామిక వాడలో వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కనీసం రోడ్ల విషయంలో కూడా శ్రద్ధ చూపించ లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం కర్నాటక రాష్ట్రానికి అత్యంత దగ్గరగా ఉండటంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గరగా ఉంది. దీంతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఎక్కువ మంది వస్తుంటారు. దీంతో పాటు కర్నాటక రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన కోసం పెట్టుబడి ఎక్కువగా ఉండటంతో పారిశ్రామిక వేత్తలు ఇక్కడికి వస్తున్నారు. అంతే కాకుండా అక్కడ స్థలం దొరకడమే కష్టంగా ఉండటంతో పాటు అనుమతులు కూడా రావడం లేదు. పైగా ఖర్చు కూడా విపరీతంగా ఉండటం, అది పెట్టుబడి, ఆదాయం మీద ప్రభావం చూపడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ప్రభుత్వం స్థలం కేటాయించడంతో పాటు అనుమతులు సైతం సులువుగా ఇస్తుందన్న భావనతో పారిశ్రామిక వేత్తలు ఎక్కువ మంది ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు మొగ్గు చూపుతారు. అయితే పారిశ్రామిక వాడలో ప్రస్తుతం ఎటువంటి అభివృద్ధి లేకపోవటంతో చాలా మంది పారిశ్రామిక వేత్తలు రావడం లేదు.

ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా పారిశ్రామిక వాడ అభివృద్ధి జరగడం లేదు. గత వైసిపి ప్రభుత్వం పారిశ్రామిక వాడ అభివృద్ధికి కనీస చర్యలు చేపట్టలేదు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ ప్రభుత్వ హయాంలో చెప్పుకోదగ్గ పరిశ్రమ ఒక్కటి రాలేదు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో 8 పారిశ్రామికవాడలు ఉన్నాయి. 1979లోనే అనంతపురంలో జోనల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. అప్పుడే ఇక్కడ పారిశ్రామికవాడను నెలకొల్పారు. అయితే 1985లో ఎన్టీఆర్ హయాంలో



తూమకుంట పారిశ్రామిక వాడ

పారిశ్రామిక వాడను ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు. పారిశ్రామిక వాడలో 151 చిన్న, మధ్య, భారీ తరహా పరిశ్రమలు ఏర్పాటు కాగా ప్రస్తుతం అందులో 30 వరకు మూతపడ్డాయి. మౌలిక వసతులు సరిగ్గా లేకపోవడంతో యజమానులు అవస్థలు పడుతున్నారు. నీటి సమస్య, అంతర్గత రహదారులు దెబ్బతినటం, మురుగు కాలువలు లేకపోవటం, వీధి దీపాల నిర్వహణ గాలి కొదిలేయడం వంటివి ప్రధానంగా వేధిస్తున్నాయి. చాలాచోట్ల అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. వారానికి ఒకసారి మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో నిర్వాహకులు రోజూ నీటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో పాటు పెరిగిన విద్యుత్తు ఛార్జీల భారాన్ని మోయలేకపోతున్నామని నిర్వాహకులు వాపోతున్నారు.

హిందూపురం సమీపంలోని తూమకుంటలోని గోళాపురం పారిశ్రామికవాడ వేదిక్ ఇస్పాట్, శాంతి స్టీల్, రిష్ మిరల్, చిన్న పరిశ్రమలు మూడు మొత్తం ఆరు మూతపడ్డాయి. ఆర్థిక ఇబ్బందులకు తోడు భాగస్వాముల మధ్య విభేదాలు ఏర్పడటంతోనే ఇవన్నీ మూతపడ్డాయి. హిందూపురం జోనల్ పరిధిలో తూమకుంట పారిశ్రామికవాడలో 50 ఎకరాలు, రహేజా కంపెనీకి చెందిన గోళాపురం పారిశ్రామిక 254 ఎకరాలు నేటికి ఖాళీగా ఉన్నాయి. అనంతపురం జోనల్ పరిధిలో 2007లో ఏర్పాటైన రాప్తాడు పారిశ్రామికవాడలో 37 ఎకరాలు ఖాళీగా ఉంది. మిగతాచోట్ల కేటాయింపులు జరిగాయి. తూమకుంటలో కొంత భూమి, గోళాపురంలో దాదాపు 50 శాతం భూమి ఖాళీగా ఉంది. స్థలాలు కేటాయిస్తున్నా వివిధ కారణాలు చెప్పి పరిశ్రమలు ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. 1978లో బళ్లారి రోడ్డులో ఉన్న పారిశ్రామిక వాడలో 71కి గాను 50 యూనిట్లు నెలకొల్పారు. ఇందులో 3 మూతపడ్డాయి. రాప్తాడు పారిశ్రామిక వాడను 2017లో ఏర్పాటు చేశారు. ఎంఎస్ఎంఇలకు కూడా 51ఎకరాలు కేటాయించారు. 322ప్లాట్లలో 197 కేటాయించారు. 1974లో గుంతకల్లు పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసి 57 ఎకరాలు కేటాయించారు. ప్రస్తుతం 17 యూనిట్లు పనిచేస్తుండగా 14 మూతపడ్డాయి. ఇక్కడా నీటి సమస్య వేధిస్తోంది. వైటీచెరువు వద్ద కొత్త పారి శ్రామిక ఏర్పాటుకు 100 ఎకరాలు కేటాయించాలని ప్రతిపాదనలు ఉన్నా గత ప్రభుత్వం భూమిని కేటాయించకలేదు. తాడిపత్రిలో 15 యూనిట్లు పనిచేస్తుండగా 6 మూతపడ్డాయి.

తగ్గిన ఆసక్తి

ఉమ్మడి అనంత జిల్లాలో ఔత్సాహికులు ఉన్నా ప్రభుత్వం పలు నిబంధనలు మార్చడంతో పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపడం లేదు. గతంలో పరిశ్రమ ఏర్పాటు చేసిన కొన్నేళ్లకు భూమిని నిర్వాహకులకు అప్పగించేవారు. ప్రస్తుతం 23 ఏళ్లకు లీజు పద్ధతిలో కేటాయిస్తున్నారు. కొన్నిచోట్ల ధరలు పెంచడంతో పరిశ్రమల ఏర్పాటుకు వెనక్కి తగ్గుతున్నారు. గతంలో ఎకరా భూమి రూ.25 లక్షలు ఉంటే ప్రస్తుతం రూ .75 లక్షలకు పెంచారు. విద్యుత్తు, ఇంధన ధరలు పెరగడంతో ఆర్థిక భారం పెరిగిపోయింది. దీంతో ఔత్సాహికులు పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపడం లేదు.



పారిశ్రామిక వాడలో ఖాళీగా ఉన్న స్థలం

ముగిసిన అండర్-14 ఫుట్ బాల్ రాష్ట్రస్థాయి టోర్నీ

ప్రజాశక్తి-హిందూపురం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

మూడు రోజులుగా హిందూపురం పట్టణంలోని ఎంజిఎం మైదానంలో జరుగుతున్న 68వ ఎస్ జి ఎఫ్ అండర్-14 ఫుట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం ముగిశాయి. బాలిబాలికల విభాగంలో ఆదివారం జరిగిన పోటీల్లో విజేతలుగా ఉమ్మడి అనంతపురం జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో ఉమ్మడి అనంతపురం-శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన పోటీలో అనంత జట్టు విజేతగా నిలచింది. బాలికల విభాగంలో అనంతపురం-తూర్పు గోదావరి జట్ల మధ్య జరిగిన పోటీలో సైతం ఉమ్మడి అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, ఎంజిఎం పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, టిడిపి పట్టణ అధ్యక్షులు, వార్డు కౌన్సిలర్ రమేష్ కుమార్, ఫుట్ బాల్ జిల్లా సెక్రెటరీ మొరార్జీ యాదవ్, పరిశీలకులు అనిల్ నాయక్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకులు శివన్న, సురేష్, ఎంజిఎం సీడీ లోకనాథ్, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పరిమళ, కౌన్సిలర్లు సతీష్ కుమార్, నాయకులు అమర్నాథ్, డైమండ్ బాబా, దుర్గా నవీన్, వాసు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వెలుగుల మాటున చీకటి వ్యాపారం

- సేల్స్ కొండంత.. పన్ను చెల్లింపు గోరంత...
- గిఫ్ట్‌బాక్సుల పేరుతో వసూళ్లు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- గత సంఘటనలతోనైనా మార్పువచ్చేనా..?

దీపావళి పండగ వచ్చిందంటే చాలు కొందరు స్వార్థపరులు కాసుల పంట పండించుకోవటానికి పోటీపడతారు. పండుగ పూట వ్యాపారాలు మాత్రం కొండంత చేసి పన్ను చెల్లింపు మాత్రం గోరంత చేస్తారు. దీన్ని ఆసరాగా చేసుకుని దళారీగా అవతారమెత్తిన నాయకులు అధికారులకు గిఫ్ట్‌బాక్సులు ఇవ్వాలని చెబుతూ వ్యాపారుల నుంచి పెద్ద మొత్తంలో వసూలుకు పాల్పడతారు. ఇన్ని లోటుపాట్ల మధ్య టపాసుల విక్రయ కేంద్రం వద్ద నిబంధనలకు పాతర వేస్తారు. టపాసుల విక్రయ కేంద్రం ఏర్పాటు నుంచి అమ్మకాలు, కనీస వసతులు ఏర్పాటులో నిబంధనలు గాలికి వదిలేస్తారు. వీటి ఫలితంగా టపాసుల కొనుగోలు దారుల నుంచి పట్టణ ప్రజల వరకు ప్రతి ఒక్కరూ ఇబ్బందులకు గురవుతారు. ఆస్తి, ప్రాణ నష్టం జరిగే ప్రమాద పరిస్థితులున్నా సంబంధిత అధికారులు వీటన్నింటీని చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటారు. ఇవన్నీ ఇంతవరకు కదిరి పట్టణంలో టపాసుల విక్రయ కేంద్రాల ఏర్పాటు చేసిన సమయంలో ఏర్పడిన పరిస్థితులు. ఈ నేపథ్యంలో ఈ సారైనా టపాసుల విక్రయ దారులు, అధికారులు నిబంధనలు పాటిస్తారా అన్న ప్రశ్నలు పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ప్రజాశక్తి - కదిరి టౌన్

దీపావళి పండుగ వేళ వ్యాపారస్తుల ఇంట లక్ష్మి టపాసుల వెలుగులు నింపితే అదే దీపావళి వేళ పట్టణ ప్రజల్లో విషాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలకు సంబంధించి వ్యాపారస్తులు ప్రభుత్వ నిబంధనలు ఏ మాత్రం పాటించలేదన్న ఆరోపణలున్నాయి. ఈ ఏడాదైనా కూటమి ప్రభుత్వ హయాంలో నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు చేపడతారా లేక షరా మాములే అన్న చందంగా వ్యవహరిస్తారా అన్న అనుమానాలు పట్టణ ప్రజల్లోఉత్పన్నమవుతున్నాయి . జనసంచారం ఉండే ప్రాంతాల్లో టపాసులు దుకాణం ఏర్పాటు చేయకూడదన్న నిబంధనలు స్పష్టంగా ఉన్నా వాటిన గాలికి వదిలేస్తున్నారన్న విమర్శలున్నాయి. కదిరిలో ఏర్పాటు చేసే దుకాణాలకు మాత్రం అధికారుల నిర్లక్ష్యం వ్యాపారుల స్వలాభంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్న ఆరోపనలు ఉన్నాయి. కొంతమంది వ్యాపారులు ఒక దుకాణానికి అనుమతి తీసుకొని రెండు లేదా మూడు దుకాణాలకు సరిపడా స్థలంలో దుకాణం ఏర్పాటు చేసుకుంటారు. అంతేకాకుండా దుకాణదారులు లక్షల రూపాయల విలువ చేసే బాణసంచా సరుకులు కొనుగోలు చేసి తక్కువ మొత్తంలో కొనుగోలు చేసినట్లు బిల్లులు సృష్టించుకుని సంబంధిత అధికారుల నుండి అనుమతులు తెచ్చుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు. దీంతో భారీ ఎత్తున పన్నులను ఎగ్గొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ తమ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులకు చూపిస్తున్న కొద్ది పాటి సరుకుకు మాత్రమే పన్ను చెల్లించి బాణసంచా వ్యాపారంలో మూడు నాలుగు రోజులకే పెద్ద ఎత్తున అక్రమంగా సంపాదించుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు. అయితే ఈ విషయంలో ఆ శాఖ అధికారులు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తుండటంతో వారి పనితీరుపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు సంవత్సరాల కిందట బాణసంచా దుకాణం వద్ద రాత్రి వేళలో కొన్ని దుకాణాల యజమానులు బయటి వ్యక్తులు కలసి మద్యం సేవిస్తూ సిగరెట్లు తాగుతు పోలీసులకు పట్టుపబడ్డారు.

దీపావళి వేళ అధికారులకు విలువైన బహుమతులు

బాణసంచా వ్యాపారస్తులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతు ప్రభుత్వ నిబంధనలను అటకెక్కిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు ఉదాసీనతగా వ్యవహరించడాన్ని బట్టి చూస్తే అధికారుల పనితీరుపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీపావళి పండగ వేళ ఓ వ్యాపారి చోటా నాయకుడన్న ముసుగులో వ్యాపారస్తుడు వ్యాపారుల నుంచి వసూళ్ల పర్వానికి తెరలేపి అధికారులకు విలువైన బహుమతులు అప్పజెప్పేవాడన్న ఆరోపణలు అప్పట్లో వెలువడ్డాయి. దీంతో అధికారులు నిబంధనల అమలులో చూసీచూడనట్లు వ్యవహరించారన్న విమర్శలున్నాయి. గత ఏడాది దీపావళి సందర్భంగా కదిరి పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్ద బాణసంచా కాలుస్తున్న సమయంలో నిప్పురవ్వలు ఓ ఇంటి పై పడటంతో ఆ ఇంటి పైఅంతస్తులో రేకుల షెడ్డులో నిల్వ ఉంచిన పరుపుల తయారికి సంబంధించిన సామగ్రి మొత్తం కాలి బూడిద అయ్యింది. అయితే ఆ భవనానికి చుట్టుపక్కల నివాసాలకు మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. లేకపోతే పెద్ద ఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం కలిగేది.

పాటించాల్సిన నిబంధనలు : ప్రభుత్వం నిర్దేశించిన నిబంధన మేరకు దుకాణానికి దుకాణానికి మధ్య దూరం కనీసం మూడు మీటర్లు తప్పనిసరిగా ఉండాలి. అలాగే బాణసంచా దుకాణాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రమాదాల నివారణ కోసం బకెట్లలో ఇసుక, డ్రమ్ములలో నీరు నిలువ ఉంచాలి. అదేవిధంగా ఆక్సిజన్ సిలిండర్ అందుబాటులో ఉంచాలి. నివాసాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, కళాశాలలకు దూరంగా బహిరంగ ప్రదేశంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. టాపాసుల రకం ధర కొనుగోలు దారులకు తెలిసేలా దుకాణాల వద్ద తప్పనిసరిగా ధరల పట్టికను ఏర్పాటు చేయాలి. అలాగే దుకాణాల వద్దకు 18 సంవత్సరాల లోపు పిల్లలను అనుమతించకూడదు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే అగ్నిమాపక వాహనం సిబ్బంది వెళ్లడానికి ఆరు మీటర్లు దారి తప్పనిసరిగా వదలాలి.దుకాణాల వద్ద అగ్నిమాపక వాహనం ఉంచినందున టపాసుల దుకాణదారులు తప్పనిసరిగా చలానా చెల్లించాలి. కేవలం అగ్నిమాపక సిబ్బందిని నియమిస్తే చలానా కట్టాల్సిన అవసరం లేదు.



గత ఏడాది టపాసుల కేంద్రం వద్ద మద్యం సేవిస్తూ పట్టుబడిన వ్యక్తులు (ఫైల్‌ఫోటో)



గత ఏడాది అధికారుల కోసం సిద్ధం చేసిన గిఫ్ట్‌బాక్సులు ఆటోలో తరలిస్తున్న దృశ్యం(ఫైల్‌ఫోటో)

నిబంధనలు పక్కాగా అమలుచేయాల్సిందే

కదిరి పట్టణంలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే టపాసుల దుకాణాలకు సంబంధించిన వ్యాపారులు నిబంధనలు పక్కాగా అమలు చేయాల్సిందే. నిబంధనలు పాటించని దుకాణాల యజమానులపై చర్యలు తీసుకుంటాం.

మన్సూర్,
అగ్నిమాపక శాఖ అధికారి, కదిరి

పెన్షనర్లు, ఉద్యోగులకు ప్రతినెలా సక్రమంగా చెల్లింపులు


జిల్లా ఉప ఖజానా సంచాలకులు కావలి రామారావు నాగమల్లిక

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో పెన్షనర్లకు ఉద్యోగస్తులకు వేతనాలు నెలనెలా సక్రమంగా అందిస్తున్నామని జిల్లా ఉప ఖజానా సంచాలకులు కావలి రామారావు నాగమల్లిక పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తి కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వివరించారు.

ప్రశ్న : జిల్లాలో ఎంతమందికి పెన్షన్లు, ఉద్యోగస్తులకు వేతనాలు ట్రెజరీ నుండి అందుతున్నాయి .?

జవాబు : శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 32 మండలాలలో ఉన్న 8 999 మంది పెన్షనర్లకు, 18,799 మంది ఉద్యోగస్తులకు ప్రతినెలా సక్రమంగా ట్రెజరీ ద్వారా వేతనాలు అందిస్తున్నాం. లోక్ అదాలత్ ద్వారా పెన్షనర్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. డిడిఒల ద్వారా ప్రతినెల 25వ తేదీన వేతనాలు పెట్టి ఒకటవ తేదీన వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.



ప్ర : పెన్షనర్లు, ఉద్యోగుల వేతనాలు పంపిణీలో సాంకేతిక సమస్యలు ఉన్నాయా?

జ : జిల్లా కార్యాలయం మూడో అంతస్తులో ఉన్నందున పనుల నిమిత్తం చాలామంది పెన్షనర్లు కార్యాలయానికి రావడానికి ప్రయాస పడుతున్నారు. ఇదే విషయాన్ని గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. కార్యాలయానికి సొంతభవనం నిర్మించే వరకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కార్యాలయ మెయింటెనెన్స్‌కు నిధులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇంటర్నెట్ తదితర సౌకర్యాలకు సైతం సొంత నిధులను వాడుతున్నాం.

ప్ర : జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉందా?

జ : శ్రీ సత్యసాయి జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది. ఎస్టీవోలు ఆరుగురు ఉండాల్సుండగా ప్రస్తుతం నలుగురే ఉన్నారు. అదేవిధంగా ఐదుగురు సీనియర్ అసిస్టెంట్లు ఉండాల్సుండగా ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్లు ప్రస్తుతం ముగ్గురు ఉన్నారు. ఇంకా ఇరువురు కావాలి. ఉన్న సిబ్బందితోనే పనులు చేస్తున్నాం.

ప్ర : ఉద్యోగులకు, పెన్షనర్లకు జిపిఎఫ్ అందుతున్నాయా?

జ : (జిపిఎఫ్) జనరల్ ప్రావిడెంట్ ఫండ్, సరెండర్ లీవ్, ఎన్కాష్మెంట్ ఆఫ్ లీవ్, జిపిఎఫ్ మెడికల్ లీవులు జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఏ ఉద్యోగికి అందలేదు. ఉద్యోగస్తులు వారి అవసరాల నిమిత్తం ఉంచుకున్న సొమ్ము సరైన సమయంలో అందించక పోవడంతో వారు కొంత అసౌకర్యానికి గురవుతున్నారు. జిల్లా కార్యాలయపు బడ్జెట్‌ను బట్టి వాటర్, కరెంటు, స్టేషనరీ తదితర బిల్లులను కార్యాలయం నుండి చెల్లిస్తాం.



జిల్లా ఉప ఖజానా సంచాలకులు
కావలి రామారావు నాగమల్లిక

విద్యుత్ సరఫరాలో అంతరాయం.. ఆగిన నీటి సరఫరా

ప్రజాశక్తి-హిందూపురం

పంపింగ్ స్టేషన్‌లో ఏర్పడిన విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల గొల్లపల్లి నుంచి హిందూపురం పురపాలక సంఘానికి నీటి సరఫరా నిలిచిపోయిందనిమున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలసుబ్రమణ్యం, ఎఇ జనార్దన్ తెలిపారు. గొల్లపల్లి నుంచి హిందూపురం వరకు అవుతున్న నీటి సరఫరాలో మూడు ప్రాంతాలలో పంపింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఇందులో ఎస్‌కెడి నగర్ పంపింగ్ స్టేషన్ వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని దీన్ని పునరుద్ధరించడానికి మూడు రోజుల సమయం పడుతుందని అన్నారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- హిందూపురం

హిందూపురం రూరల్ మండల వ్యాప్తంగా మండల కన్వీనర్ ఆశ్వర్థ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. కిరికెర పంచాయతీ వీవర్స్ కాలనీ, మనేసముద్రం పంచాయతీలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప, కిరికెర మాజీ సర్పంచి హెచ్ఎన్. రాము, ఎంపిటిసి ఆంజినేయులు, కో ఆప్షన్ మెంబర్ ముస్తఫా, మల్లికార్జున, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి

జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిశేషు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ప్రతి విద్యార్థి సృజనాత్మకంగా ఆలోచించి, ప్రతి అంశాన్ని పరిశీలనాత్మకంగా, హేతుబద్ధంగా, చూసి ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆదిశేషు సూచించారు. పట్టణంలోని సాధన హైస్కూల్‌లో ఆదివారం జెవివి ఆధ్వర్యంలో చెకుముకి జిల్లా స్థాయి పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఆదిశేషు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలు, ప్రకృతి నుంచి నేర్చుకునేతత్వం అలవాటు చేసుకోవాలన్నారు. చెకుముకి పరీక్షల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. సైన్స్ లేనిదే భూమి మీద మనుగడ సాధ్యం కాదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.జయచంద్రారెడ్డి తెలిపారు. యూరోపియన్ దేశాల్లో దేశాభివృద్ధికి విద్యార్థులే అద్భుత సలహాలు ఇస్తారన్నారు. పాలకులకు శాస్త్రీయ దృక్పథం ఉన్నప్పుడే దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని జెవివి జిల్లా అధ్యక్షులు ఎన్.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సైన్సును స్వప్రయోజనాలకు వాడుకొని సొమ్ము చేసుకునే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హిందూపురం జోన్ అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. అలాగే ఆయన చేసిన ఇంద్రజాలం ఆకట్టుకుంది. మూఢనమ్మకాల నిర్మూలన, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంలో జెవివి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చెకుముకి పరీక్షల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు అన్ని రకాల పోటీ పరీక్షలను సులభంగా అర్థం చేసుకొని సరైన ఫలితాలు పొందడానికి తోడ్పడతాయని పాఠశాల కరస్పాండెంట్ సాధిక్‌బాషా తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి సిద్ధరాంపురం ఉన్నత పాఠశాలకు చెందిన వి.లోకేష్‌కుమార్‌రెడ్డి, చాంద్‌ప్రియ, చిన్నశివయ్య, ప్రయివేట్ పాఠశాలల నుంచి ఒడిచెరువు రెయిన్ బో ఉన్నత పాఠశాలకు చెందిన బి.లయశ్రీ, యశ్వంత్, హర్షవర్ధన్‌రెడ్డి రాష్ట్రస్థాయికి ఎంపిక య్యారని జెవివి జిల్లా ఉపాధ్యక్షులు బి.నరసారెడ్డి తెలిపారు. పరీక్షలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్, పాఠశాలలకు మెమెంటోలు అందజేశారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులకు స్థానిక పాఠశాల కరస్పాండెంట్ సాదిక్‌బాషా భోజన సదుపాయం కల్పించారు. అలాతే మెమెంటోలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌టిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రప్రసాద్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి తాహిర్‌వలి, శ్రీనివాసులు, జెవివి కార్యకర్తలు వీరాస్వామి, మహబూబ్‌బాషా, సుబ్బారెడ్డి, హరి, గంగాధరనాయక్, రామాంజనేయులు పాల్గొన్నారు.



ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి

ప్రజాశక్తి-పరిగి

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత వెల్లడించారు. మంత్రి ఆదివారం పరిగి ట్యాంక్ బండ్‌ను పరిశీలించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం పాటుపడుతుందన్నారు. పరిగి చెరువు పూర్తిస్థాయిలో నిండిన వెంటనే చెరువు పరిధిలోని ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. అలాగే పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి లీకేజీలను పూర్తిస్థాయిలో నివారించాలని సూచించారు. ఇప్పటివరకూ నిర్వహించిన పనుల వల్లనే చెరువులోకి పూర్తిస్థాయిలో నీరు చేరే అవకాశం ఉందని ఆ విధంగా పని చేసిన డి.లక్ష్మీనారాయణ, కరణం లక్ష్మీనారాయణలను అభినందించారు. మంత్రి వెంట మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ, సర్పంచి బాలాజీ, మాజీ ఎంపిపి సత్యనారాయణ ఉన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని కాలువపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు వాల్మీకి బొజ్జప్ప చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఈ విషయం తెలియడంతో మంత్రి ఆదివారం కాలువపల్లి గ్రామానికి వెళ్లి బొజ్జప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే అంత్యక్రియల కోసం ఆర్థికసాయం అందజేశారు.



పరిగి చెరువును పరిశీలిస్తున్న మంత్రి సవిత

టిడిపిలో కార్యకర్తలకు తగిన గుర్తింపు

పెనుకొండ : దేశంలో ఏ ఇతర రాజకీయ పార్టీలో లేనివిధంగా టిడిపిలో క్రియాశీలక కార్యకర్తలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం మంత్రి పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పెనుకొండ నియోజకవర్గం ఎప్పటికీ టిడిపి కంచుకోట అన్నారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలన్నారు. నా గెలుపు వెనక కార్యకర్తల కష్టం ఉందన్నారు. సుశిక్షితులైన కార్యకర్తలే తనకు ఆస్తి పాస్తులన్నారు. టిడిపి సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించి రికార్డు స్థాయిలో సభ్యత్వాలు చేయించాలని సూచించారు. అలాగే సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. టిడిపి సభ్యత్వంతో ప్రతి కార్యకర్తకు భరోసా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

పట్టణంలోని తన కార్యాలయంలో మంత్రి సవిత ఆదివారం 8మందికి సిఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. అందులో నిజప్పగారి మైలారప్పకు రూ. 15వేలు, ఈశ్వరమ్మకు రూ. 25వేలు, దీపికకు రూ. 20వేలు, పెద్దన్నకు రూ. 87,709, మహబూబాషాకు రూ. 16,670, నాగభూషణంకు రూ. 1,53,290, నాగార్జున కళావతికి రూ. 20వేలు, సుకన్యకు రూ. 1,67,727 చెక్కులను అందజేశారు.

ప్రభుత్వ బడుల పరిరక్షణకు రాజీలేని పోరాటం : యుటిఎఫ్

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు యుటిఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ తెలిపారు. పట్టణంలోని ఎంఎస్ఆర్ రెసిడెన్సీ వద్ద ఆదివారం యుటిఎఫ్ పెనుకొండ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి జిసి.నరేష్‌కుమార్ అధ్యక్షతన స్వర్ణోత్సవ మండల స్థాయి మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథి ఎం.సుధాకర్ మాట్లాడుతూ విద్యారంగ సంస్థలు ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే సమాజంలో నైతిక విలువలు, ప్రజాతంత్ర హక్కులను నిలబెట్టుకోగలమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమానికి యుటిఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. పాలకవర్గాల విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ బలహీనపడిందన్నారు. ఈ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తల తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. 117 జీవోను వెంటనే రద్దు చేయాలని, మెరుగైన పిఆర్‌సి, ఐఆర్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పి.కృష్ణానాయక్, అధ్యక్షులుగా యు.ఉపేంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శిగా జి.రమేష్, ఉపాధ్యక్షులుగా పెద్దిరాజు, ఎం.నాగమణి, కోశాధికారిగా ఆదిశేషు, కౌన్సిలర్లుగా ఎం.నరసింహుడు, జిసి.రాజశేఖర్, వి.రామాంజనేయులు, శ్రీనివాసులు, జె.నరేష్‌బాబు, ఏ.గాయత్రి, సంధ్యారాణి, ఎ.ప్రమీలమ్మ, కె.హరిత, ఎం.కళావతి, జిల్లా మహాసభ ప్రతినిధులుగా, జి.రాజగోపాల్, ఎం.రాధారాణి, జి.ఓబిలేసు, భువనేశ్వరి, ఎ.శిల్పాస్వామి, జావీద్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎన్ఐ.రవీంద్రనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



స్వర్ణోత్సవ మండల స్థాయి మహాసభలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలు, పారిశుధ్య కార్మికులతో ఆదివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. జెవి.రమణ మాట్లాడుతూ ధర్మవరం మున్సిపల్ పాఠశాలలో 30 ఏళ్లకు పైబడి పని చేస్తున్న ఆయాలకు రూ. 4వేలు, పారిశుధ్య కార్మికులకు రూ. 6వేలు ఇస్తూ వారితో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారన్నారు. తక్షణమే వారికి కనీస వేతనం, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెల 5వ తేదీ లోపు వేతనాలు, అరియర్స్ చెల్లించాలని, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్లను మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లడానికి కార్మికులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కోకన్వీనర్ ఎల్.ఆదినారాయణ, నాయకు రాళ్ల చౌడమ్మ, జయమ్మ, ముంతాజ్, కె.నాగవేణి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు మండల కన్వీనర్ రమణ

బాధ్యతలు చేపట్టిన డిఇఒ

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లా విద్యాశాఖ అధికారి(డిఇఒ)గా క్రిష్ణప్ప శనివారం రాత్రి డీఈవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన కడప జిల్లా ఇన్‌చార్జి డిఇఒగా ఉంటూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన డిఇఒ కు జిల్లాలోనే ఎంఇఒలు, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. డిఇఒ మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాలో విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.



డిఇఒ క్రిష్ణప్ప

నేడు రక్తదాన శిబిరం

పుట్టపర్తి రూరల్ : పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ వి.రత్న ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ రక్తదాన శిబిరం నిర్వహిస్తు న్నామని, విద్యార్థులు, యువకులు, పోలీసులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని ఎస్పీ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మవరం రూరల్ : మండలంలోని చిగిచెర్ల సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ జానకిరామయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు, ప్రజలు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

బాణసంచా అక్రమంగా విక్రయిస్తే చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వి.రత్న ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రమాదాలకు తావు లేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ బాణసంచా నిల్వ ఉంచాలన్నారు. లైసెన్స్ పొందిన వారు కేటాయించిన ప్రదేశంలోనే దుకాణం ఏర్పాటు చేసుకుని టపాసులు విక్రయించాలన్నారు. నీరు, ఇసుక, తదితర, అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా దుకాణాల వద్ద సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా మందు గుండు సామగ్రి కలిగి ఉన్నా, తయారుచేసినా లేదా అనధికార ప్రదేశాలల్లో నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తప్పవన్నారు. టపాసుల దుకాణాల వద్ద అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు విధిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అధికారులు, వివిధ శాఖలు సమన్వయంతో పని చేసి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా దీపావళి పండుగను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీపావళి రోజు టపాసులు కాల్చే సమయంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్ 100 లేదా డయల్ 112కి లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా టపాసుల విక్రయదారులు విధిగా నిబంధనలు పాటించాలని ఎస్పీ ఆదేశించారు.



ఎస్పీ వి.రత్న

ఉచిత ఇసుక విధానంపై హర్షం

ప్రజాశక్తి-నల్లచెరువు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంపై సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ ఎద్దుల అంజనప్ప హర్షం వ్యక్తం చేశారు. నల్లచెరువులో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభు త్వంలో ఇసుక కావాలంటే వేల రూపాయలు చెల్లించాల్సి వచ్చేదని, దీంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టారని హర్షం వ్యక్తం చేశారు. పేదల కోసం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత ఇసుక విధానం వల్ల పేదల సొంతిల్లు కల నెరవేరుతుందన్నారు. అలాగే దీపావళి నుంచి ఉచిత గ్యాస్ పంపిణీపై నిర్ణయం తీ ు ు ు ు వ ు ం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ప్రధాన్యతా క్రమంలో ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా త్వరలోనే కలుగజేస్తుందని తెలిపారు. ఆయనతో పాటు మండల టిడిపి నాయకులు ఉన్నారు.



ఎద్దుల అంజన్న

భూనిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ ఎస్ రోడ్డు బాధితులు

ప్రజాశక్తి-హిందూపురం

పురం అభివృద్ధికి తాము పూర్తి సహకారం అందిస్తామని, అయితే తమకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం చెల్లించాలని రైల్వే రోడ్డు విస్తరణకు భవనాలు కోల్పోతున్న బాధితులు డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా భవనాలు కోల్పోతున్న బాధితులు ఆదివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాధితులు డాక్టర్ దేవరాజ్, జియావుల్లా ఖాన్, రీయాజుల్లా ఖాన్ మాట్లాడుతు దాదాపు 20 సంవత్సరాలుగా బాలాజీ సర్కిల్ లో దంత వైద్యశాలను నిర్వహిస్తు జీవనం చేస్తున్నామన్నారు. అయితే రోడ్డు విస్తరణలో భాగంగా తాను నిర్వహిస్తున్న క్లినిక్ పూర్తిగ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దీనికి తనకు అభ్యంతరం లేదని, మున్సిపల్ అధికారులు తనకు ఏలాంటి నష్ట పరిహారం ఇవ్వకుండా భవనాన్ని పగలగొట్టాలని ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తన వైద్యశాల భవనం కూల్చివేస్తే తాను చాలా ఇబ్బందులకు గురవుతానన్నారు. ఉన్న ఈ ఆస్తిని రహదారి నిర్మాణంలో పోగొట్టుకుంటే తనకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు ఒక్కొక్కసారి ఒక్కో కొలతతో తన ముందుకు వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించి, తగిన నష్ట పరిహారాన్ని పొందేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ తన కింద స్థాయి ఉద్యోగులను పంపి నామ మాత్రపు నష్ట పరిహారాన్ని చెల్లిస్తామని చెబుతున్నారని ప్రభుత్వ నిబంధనల మేరకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జియావుల్లా ఖాన్ మాట్లాడుతూ తనకు ఉన్న కొద్దిపాటి భవనాన్ని మునిసిపల్ అధికారులు కూల్చివేస్తే తమ కుటుంబ జీవనం కూడా కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి నియమ నిబంధనల ప్రకారం తమకు నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాధితులు రియావుల్లా ఖాన్, హయత్, పరీష్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



వాల్మీకులు అభివృద్ధి చెందాలి


ప్రజాశక్తి-గుడిబండ

వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్సీ గుండు మల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఎమ్మెల్యే రాజు సతీమణి ఉమాదేవి తెలి పారు. మండలంలోని శంకరగల్లు గ్రామంలో వాల్మీకి సామాజికవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాల్లో వారు పాల్గొన్నారు. ముందుగా వారు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాల్మీకి కులస్తులు వారికి శాలువాలు కప్పి సన్మానించారు. వారు మాట్లాడుతూ వాల్మీకుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రతి వాల్మీకి కుటుంబం తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. అనంతరం వారు అన్న దాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, బాధిపల్లెప్ప, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం.రాజు దక్షిణ భారత ఇంటర్ యూనివర్సిటీ(ఎస్‌కెయు తరపున) పోటీలకు ఎంపికయ్యాడని కోచ్ ఆదిరత్నకుమార్ తెలిపారు. బి.కాం తృతీయ సంవత్సరం చదువుతున్న రాజు అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజీలో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగిన చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడని తెలిపారు. రాజు నవంబర్‌లో చెన్నైలోని వెల్టెక్ యూనివర్సిటీలో జరిగే చెస్ పోటీల్లో రాజు ఎస్‌కెయు తరపున పాల్గొంటాడని తెలిపారు. రాజు స్థానిక బిఎస్‌కె చెస్ అకాడమీ లో శిక్షణ పొంది మంచి ప్రతిభ కనబరచడం గర్వించదగ్గ విషయమని కోచ్ తెలిపారు. రాజును చెస్ కోచ్‌తో పాటు కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.



విద్యార్థి రాజుతో కళాశాల సిబ్బంది

గంట్ల మారెమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని గంట్ల మారెమ్మ అమ్మవారిని ఆదివారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆమెకు అర్చకులు స్వాగతం పలికి సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో మాజీ కౌన్సిలర్ పోతన్న బంధువుల పెళ్లికి, బ్రాహ్మణపల్లిలో గంధమనేని, మల్లెల వారి వివాహానికి, గువ్వలగుట్లపల్లికి చెందిన కాంట్రాక్టర్ వెంకటాద్రి బంధువుల వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు రామాంజనేయులు, మనోహర్, ఉమాపతి, బొమ్మయ్య, విజయ్ కుమార్, వెంకటాద్రి, కార్యకర్తలు ఉన్నారు.

'హేతుబద్ధీకరణలో ఎఇఒలను మినహాయించాలి'

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

హేతుబద్ధీకరణ పేరుతో వ్యవసాయ విస్తరణ అధికారులు(ఎఇఒ) స్థాయి తగ్గించే చర్యలు చేపట్ట డాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.ఆనంద్‌నాయక్ తెలిపారు. హేతు బద్ధీకరణ పేరుతో గ్రామస్థాయి వ్యవసాయ సహాయకులకు సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ స్థాయిలో పని చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు సమాన పని చేసేలా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ప్రయత్నం చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో మిగులు ఎంపిఇఒలు ఉండగా వారిని పరిగణలోకి తీసుకోకుండా సుమారు 12 నుంచి 30 ఏళ్లుగా సేవలందిస్తున్న ఎఇఒలను మాత్రమే తీసుకోవడం అన్యాయమన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలో పని చేసే గ్రామస్థాయి సహాయకులను రైతు సేవా కేంద్రాల్లో నిమించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శ్మశానవాటికకు స్థలం చూపాలి

ప్రజాశక్తి-తనకల్లు

తనకల్లులో నాయీబ్రాహ్మణులకు శ్మశానవాటిక లేక ఎన్నో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పి.మల్లికార్జున ఆధ్వర్యంలో తహశీల్దార్ శోభాసువర్ణమ్మకు వినతిపత్రి ఇచ్చారు. స్పందించిన తహశీల్దార్ శ్మశానవాటికకు అనుకూలమైన ప్రభుత్వ స్థలం చూపితే కేటాయిస్తామని తెలిపారు. తహశీల్దార్ తమనే స్థలం చూపమనడం సరికాదన్నారు. రెవెన్యూ అధికారులే మండల కేంద్రానికి అతి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి శ్మశానవాటికకు తక్షణమే స్థలం కేటాయించాలని కోరారు. లేనిచో రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ ద్వారా వివరాలు సేకరించి, ప్రభుత్వ భూమిని గుర్తించి, జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని వారు తెలిపారు.

'సామకోటి' ఆధ్వర్యంలో రహదారి మరమ్మతులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ పరిధిలోని కమ్మవారిపల్లి రోడ్డులో రెడ్డికుంట వద్ద పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ విషయం టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆది నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన ఆదివారం సొంత నిధులతో గుంతలను పూడ్చించారు. అలాగే రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లపొదలను జెసిబి సాయంతో తొలగించారు. సామకోటి మాట్లాడుతూ ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు తన సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేయించానని తెలిపారు. ఆ ప్రాంత వాసులు సామకోటికి ధన్యవాదాలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జెసిబితో మరమ్మతులు చేయిస్తున్న సామకోటి

మృతుని కుటుంబానికి 'కేతిరెడ్డి' ఆర్థికసాయం

ధర్మవరం రూరల్ : మండలంలోని ఏలుకుంట్ల గ్రామ సర్పంచి కుమారుడు దామోదర్ ఈ నెల 25వ తేదీ ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో ఆదివారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎలుకుంట్ల గ్రామం వెళ్లి, సర్పంచి కుటుంబాన్ని పరామర్శించి రూ. 50 వేలు అందజేసి, అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

నంబులపూలకుంట : మండలంలోని పెడబల్లి పంచాయతీ సమీపంలో ఆదివారం పోలీ సులు 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారని ఎస్ఐ వలిబాషా తెలిపారు. సమాచారం అందడంతో పోలీసులు, విఆర్ఒ కలిసి వెళ్లి పెడబల్లి పంచాయతీ పరిధిలోని నల్లగుట్టతండా వెళ్లే రహదారి పక్కన ఉన్న కాలువ సమీపంలో ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు. అలాగే రాత్రివేళ వాహనాల తనిఖీ చేసి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాల్లో పోలీసుల తనిఖీలు

ధర్మవరం రూరల్ : డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున రూరల్ సిఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి మండలంలోని ఓబుళనాయనిపల్లె, తండాలో తనిఖీలు చేశారు. నాటు సారా అమ్మే వారి ఇళ్లలో సోదాలు చేశారు. అలాగే ఊరి వెలుపల ముళ్లపొదల్లో తనిఖీలు చేసి 50 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజలు ప్రశాంత జీవనం సాగించాలని తెలిపారు. గొడవలకు దూరంగా ఉండాలని, మద్యానికి బానిస కాకూడదని, ఎవరైనా నాటు సారా తయారు చేసినా, అమ్మినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆ సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా నాటుసారాను అరికడతామని తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

తలుపుల : మండలంలోని భూపతివాండ్లపల్లి అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మెరుపు దాడి చేసి రూ. 1,62,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి మారువేషంలో వెళ్లి పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరు స్తామని తెలిపారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి..

జిల్లాలో ఆదివారం వేర్వురు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. హిందూపురం పట్టణ పరిధిలోని మోత్కుపల్లి వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో పరిగి మండలంలోని కాలువపల్లికి చెందిన బొజ్జప్ప(45), నరహరి(36) మృతి చెందగా ప్రవీణ్ గాయపడ్డాడు. అలాగే హిందూపురం రూరల్ మండలంలోని కొల్లకుంట సమీపంలో ఉన్న ఎ-1 స్టీల్ పరిశ్రమ వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో అలియా(7) మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ పరిధిలోని మోత్కుపల్లి వద్ద శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో కారు అదుపుతప్పి నాగులకట్టకు ఢీకొని నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరోకరు తీవ్రంగా గాయపడ్డారు. అందుకు సంబందించిన వివరాల మేరకు పరిగి మండలం కాలువ పల్లికి చెందిన బొజ్జప్ప(45) తన నివాసంలో జరిగే శుభ కార్యక్రమానికి అవసరమైన సరుకులు తీసుకోవడానికి తనతో పాటు నరహరి(36), ప్రవీణ్‌తో కలిసి కారులో హిందూపురం వచ్చి తిరిగి గ్రామానికి బయల్దేరాడు. ఆ సమయంలో కారు అదుపు తప్పి మోత్కుపల్లి మలుపు వద్ద ఉన్న నాగుల కట్టకు ఢీకొని నిర్మాణదశలో ఉన్న ఓ ఇంటిలోకి దూసుకు పోయింది. ఈ ప్రమాదంలో బొజ్జప్ప, నరహరి ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రవీణ్ తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని హిందూపూరం జిల్లా అసుపత్రికి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. ఈ సంఘటనపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

బైక్‌లు ఢీకొని చిన్నారి మృతి.. ముగ్గురికి గాయాలు

హిందూపురం రూరల్ మండల పరిధిలోని కొల్లకుంట సమీపంలో ఉన్నా ఎ-1 స్టీల్ పరిశ్రమ వద్ద ఆదివారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఏడేళ్ల చిన్నారి మృతిచెందింది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అందుకు సంబందించిన వివరాలు.. సోమందేపల్లికి చెందిన బాబావలి తన ఇద్దరు పిల్లలు అనారోగ్యం పాలుకావటంతో తన భార్య మేహర్ తాజ్‌తో కలిసి ద్విచక్రవాణంలో హిందూపురం వచ్చి అసుపత్రిలో చికిత్స చేయించుకుని తిరిగి సోమందేపల్లికి వెళుతున్నాడు. అదే సమయంలో యోనా అనే వ్యక్తి పెనుకొండ వైపు నుంచి హిందూపురానికి ద్విచక్రవాహనంలో వస్తున్నాడు. ఏ-1 స్టీల్ పరిశ్రమ ప్రధాన రహదారిలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఈ రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాబావలి కూతురు అలియా(7) అనే చిన్నారి సంఘటన స్థలంలోనే మృతిచెందింది. బాబావలికి తీవ్ర గాయాలు కాగా మరో చిన్నారి జోయా, బాబావలి భార్య మోహర్ తాజ్, మరో ద్విచక్ర వాహనదారుడు యోనా స్వల్పగాయాల పాలయ్యారు. గాయపడిన వారిని హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అయితే బాబావలి ఆరోగ్య పరిస్థితితి విషమంగా ఉంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.